క్లుప్తంగా

దుస్తులు, సరకులు పంపిణీ



పేద విద్యార్థినులకు దుస్తులు అందిస్తున్న సీఐ రమేష్

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్వర్గ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలిగొట్ల స్వర్గశ్రీ జయంతిని చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ డి.రమేష్ 60 మంది పేద విద్యార్థినులకు దుస్తులు, పది కుటుంబాలకు నిత్యావసర సరకులు, పరిసరాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో పదికి పది పాయింట్లు సాధించిన 30 మంది విద్యార్థులకు రూ.లక్ష నగదు ప్రోత్సాహం ఫౌండేషన్ తరపున అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా నిరంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పేదలకు సేవలు, సాయం ఇలాగే కొనసాగిస్తానని తెలిపారు. ఎస్ఐ భరత్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారి శివరాణి, విటా మైనింగ్ ఎండీ పి.విజయ్, ఫౌండేషన్ సభ్యులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.వి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ



సాధించిన పతకాలతో మధురవాడ ఫెన్సర్లు

మధురవాడ: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో మధురవాడకి చెందిన ఇద్దరు ఫెన్సర్లు సత్తా చాటారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ ఫెన్సింగ్ పోటీల్లో మధురవాడకి చెందిన బి.రాజేశ్వరి, కావ్యశ్రీ శాబర్ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఎన్ఐఎస్ కోచ్ ఐ.చరణ్, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.త్రినాథరావు విజేతలను అభినందించారు. ఈ క్రీడలో రాణించిన వారు ఉన్నత చదువులకు సీట్లు పొందడానికి రిజర్వేషన్ కూడా లభిస్తుందని వారు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగికి అవార్డు



విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ నుంచి అవార్డు అందుకుంటున్న శివకుమార్

పీఎం పాలెం: విద్యుత్ శాఖ జోన్ – 3 పరిధిలో పనిచేస్తున్న పి.శివకుమార్ విధి నిర్వాహణలో ఉత్తమ సేవలు అందించినందుకు జేఎల్ఎం గ్రేడ్ టూ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యుత్ సరఫరాలో అవాంతరాలు లేకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా అంకిత భావంతో అందిస్తున్న సేవలను గుర్తించి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ మహేంద్రనాథ్ ప్రతిభ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా విశాఖ జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు, స్థానిక ఏఈఈ మండల అప్పలనాయుడు తదితరులు శివకుమార్‌ను అభినందించారు.

'భగవంతుని చేరేందుకు భిన్న మార్గాలు'

తగరపువలస: భగవంతుని చేరడానికి విభిన్న మార్గాలు, మతాలు ఉన్నాయని అనుభవ పూర్వకంగా ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి రామకృష్ణ పరమహంస అని బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు అన్నారు. బుధవారం రామకృష్ణ పరమహంస వర్ధంతి సందర్భంగా ఆయన చరిత్రను విద్యార్థులకు వివరించారు. 19వ శతాబ్దపు బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో ఈయన ప్రభావం ఉందన్నారు. రామకృష్ణుని ముఖ్య వారసునిగా వివేకానందుడు ఆయన సందేశాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పారన్నారు. రామకృష్ణ స్వయంగా విష్ణుమూర్తి అవతారాలైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పేర్లను పెట్టుకుని కాళీ, దుర్గామాతల భక్తుడై అన్ని శాస్త్రాలను అభ్యసించాడన్నారు.

హైవేపై అడ్డదారులు!



ఈగలవానిపాలెం వద్ద తొలగించిన గ్రిల్



నీళ్ల కుండీలకు సమీపంలో జాతీయ రహదారి డివైడర్‌పై బైక్‌లు వెళ్లేందుకు తొలగించిన గ్రిల్

- ఇష్టారాజ్యంగా రాకపోకలతో ప్రమాదాలు

ఆనందపురం : శీఘ్ర ప్రయాణం కోసం ఏర్పాటు చేసిన జాతీయ రహదారి (ఆరు లైన్ల రహదారి)పై కొందరు అడ్డదారులు ఏర్పాటు చేసుకొని ప్రయాణాలు సాగిస్తుండడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారులు రోడ్డు నిర్వహణను గాలి కొదిలేశారు. దీంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకూ గతంలో రెండు లైన్లతో జాతీయ రహదారి ఉండేది. కాగా ఈ మార్గంలో రాకపోకలు ఎక్కువగా ఉండడంతో ఆరులైన్ల రహదారిగా తీర్చిదిద్దారు. మధ్యలో నాలుగు లైన్లు, ఇరువైపులా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేశారు. మధ్యలో నాలుగు లైన్ల రహదారిలో ప్రవేశించే వారు పెందుర్తి నుంచి ఆనందపురం వరకూ ఉన్న గ్రామాల వద్ద సర్వీసు రోడ్డుకు అనుసంధానం చేయలేదు. దీంతో పొరపాటున మెయిన్ రోడ్డులోకి ప్రవేశించిన వారు తమ గ్రామం వద్ద సర్వీసు రోడ్డులోకి వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో గ్రిల్ తొలగించి అడ్డదారులు ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా ద్విచక్ర వాహనాలతో ప్రయాణిస్తున్నారు. అలాగే సత్రవు జంక్షన్ నుంచి ఆనందపురం వరకూ ఆరులైన్ల రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లకు ఆనుకొని పరిశ్రమలు, విద్యా సంస్థలు, పెట్రోలు బంక్‌లు ఉన్నాయి. కానీ కొన్ని గ్రామాల ప్రజలు వాటిని చేరుకోవడానికి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న అండర్ పాత్ వేల గుండా ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో రహదారి మధ్యలో ఉన్న గ్రిల్స్‌ను తొలగించి ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్నారు. జాతీయ రహదారిపై ఏ వాహనమూ 120 కిలోమీటర్ల వేగం తగ్గకుండా ప్రయాణిస్తుంది. దీంతో అడ్డదారుల ప్రయాణం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సంగివలస వద్ద ఆగని ఆర్టీసీ బస్సులు

- రాకపోకలకు ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



ప్రయాణికులు వేచి ఉన్నా సంగివలస వద్ద ఆగకుండా వెళ్లిపోతున్న 411వి సిటీ బస్సు

తగరపువలస: విశాఖ నుంచి తగరపువలస వైపు వచ్చే అన్ని బస్సులు సంగివలస మూడు గుడుల వద్ద ఆపుతున్నా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి విశాఖ వైపు వెళ్లే బస్సులు ఇక్కడ నిలపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తగరపువలస చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రోజూ వేలాది మంది ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వ్యాపారులు, విద్యార్థులు విశాఖ వైపు రాకపోకలు సాగిస్తుంటారు. కేవలం తగరపువలస కూడలి నుంచి వెళ్లే బస్సులు మాత్రమే సర్వీస్ రోడ్డుపై నుంచి వెళ్తూ సంగివలస వద్ద ఆగుతున్నాయి. హైవే పైనుంచి వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లతోపాటు కూర్మన్నపాలెం, రైల్వే స్టేషన్, గాజువాక వెళ్లే సిటీ బస్సులు, శ్రీకాకుళం ప్యాసింజర్ బస్సులు సంగివలసలో ఆపకపోవడంతో నిరీక్షణతోనే ప్రయాణికుల సమయం వృథా అవుతోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో హైవేపై రాకపోకలు సాగించే ఆటోలు, వ్యాన్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. తమ సమస్యలను దృష్టిలో పెట్టుకుని అందరికీ అందుబాటులో ఉండేలా సంగివలస మూడు ఆలయాల ఎదురుగా విశాఖ వైపు వెళ్లే బస్సు సర్వీసులు అన్నింటినీ నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అంబేద్కరు కూడలి మీదుగా నడపాలి...

విజయనగరం నుంచి 211 నంబరు సర్వీస్ తగరపువలస మీదుగా విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరుతుంది. ఉదయం 6.20 గంటలకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు వెళ్లే ప్రయాణికులకు తగరపువలస, భీమిలి నుంచి ఏకకాలంలో రెండు వేర్వేరు బస్సులు ఉదయం 4.30కు ఉన్నాయి. ఈ బస్సులు భీమిలి ప్రజలకు అందుబాటులో ఉన్నా తగరపువలస బైపాస్ మీదుగా వెళ్లిపోవడంతో ఇక్కడి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బైపాస్ మీదుగా కాకుండా అంబేద్కర్ కూడలి మీదుగా ఈ 211 నంబరు సర్వీస్ నడపాలని పలువురు కోరుతున్నారు. అలాగే ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య తగరపువలస నుంచి విశాఖ వైపు వెళ్లే సిటీ బస్సులు తక్కువగా ఉన్నాయని, వీటిని పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్సుల కోసం కనీసం వెయ్యి మంది ఈ సమయంలో వేచి చూస్తున్నా అందుబాటులో లేని కారణంగా వెంకటేశ్వరమెట్ట హైవే వద్దకు ఉరుకులు పరుగులు తీస్తూ ఎక్స్‌ప్రెస్ బస్సులను అందుకోవాల్సి వస్తోందని అంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళ ప్రయాణికుల రద్దీ కారణంగా మరిన్ని సర్వీస్‌లు పెంచాలని కోరుతున్నారు.

మానసిక రోగులకు ఉచిత వైద్యం



మానసిక రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానసిక వ్యాధిగ్రస్తులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని మానసిక వైద్యాధికారి ఎస్.తేజస్విని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆమె మానసిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది, ఆశా వర్కర్లతో సమావేశమయ్యారు. గ్రామాల్లో మూర్ఛ వ్యాధి, ఆందోళనకు గురి కావడం, మానసిక రుగ్మత, నిద్రలేమి, వారిలో వారు నవ్వుకోవడం వంటి లక్షణాలు గల వారిని గుర్తించి తీసుకురావాలన్నారు. అలాంటి వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. నెలలో ఒక రోజు ప్రత్యేకంగా ఈ వైద్య సేవలు అందిస్తామని, వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.గంగునాయుడు, సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, పి.హెచ్.ఎన్.టి.కృష్ణవేణి, సోషల్ వర్కర్ జి.సత్తిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు వెలగక హైవేపై అంధకారం

తగరపువలస: స్థానిక జాతీయ రహదారిపై వలందపేట నుంచి సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం వరకు ఇరువైపులా, అలాగే సెంట్రల్ లైటింగ్‌కు సంబంధించి కిలోమీటరున్నర దూరం వరకు విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో ఈ ప్రాంతమంతా అంధకారం నెలకొంది. అలాగే ముగ్గురు అమ్మవార్ల ఆలయం నుంచి తగరపువలస ఫ్లై ఓవర్‌పై పాక్షికంగా విద్యుత్ దీపాలు వెలగడం లేదు. చీకటిలో ఇబ్బందులు పడుతున్నామని, వీటిని పునరుద్ధరించాలని వాహనదారులు, ఇరువైపులా నివసిస్తున్న వారు కోరుతున్నారు.

- భీమిలి జోన్ రెండో వార్డు టీచర్స్ కాలనీ వద్ద నర్సింగ్ హోమ్ నుంచి ఆదర్శనగర్ మీదుగా శుభం అపార్టుమెంట్ల వరకు వీధిదీపాలు వెలగడం లేదు. సంతపేట గొల్లవీధి నుంచి పాత ఆంధ్రా బ్యాంకు వరకు వీధి దీపాలు పాక్షికంగా మాత్రమే వెలుగుతున్నాయి.

పబ్లిక్ డిమాండ్

మూసేసిన రహదారిని తెరిపించండి



భీమిలి చిన్న బజారులో ఇరువైపులా వ్యాపారులు మూసివేసిన రహదారి

తగరపువలస: భీమిలి చిన్న బజారులో పీవీ రమణయ్య గ్యాస్ ఏజెన్సీ ముందు నుంచి దొరతోట రహదారికి అనుసంధానంగా ఉన్న మార్గాన్ని ఇక్కడి వ్యాపారులు ఇరువైపులా మూసివేశారు. ఈ రహదారిపై కొందరు తమ వ్యాపారాల నిర్వహణకు బలవంతంగా మూసివేశారు. స్టాపర్లు అడ్డంగా ఉంచేయడంతో ఆటోల రాకపోకలు దేవుడెరుగు..., ద్విచక్ర వాహనదారులు చుట్టూ తిరిగి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మూసివేసిన ఈ రహదారిని జీవీఎంసీ, భీమిలి పోలీస్ విభాగం అధికారులు తెరిపించి స్థానికుల రాకపోకలకు అనుమతించాలి.

– నున్న భీమశంకరరావు, భీమిలి.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



భీమిలి ఆర్డీవో కార్యాలయంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీవో తారకేశ్వరి

తగరపువలస: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని భీమిలి ఇన్‌చార్జి ఆర్డీవో జె.తారకేశ్వరి అన్నారు. భీమిలి ఆర్డీవో కార్యాలయంలో సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, అడ్వయిజరీ కమిటీ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ కమిటీ సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తగు సమయాల్లో స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయడమే కాకుండా క్రమం తప్పకుండా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసేటప్పుడు రిజిస్టర్లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జిల్లాలో ప్రతి మూడు నెలలకు ఒకసారి స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ కార్యక్రమాలు తరచూ అన్ని ప్రాంతాలకు చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమావతి, కేజీహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ సి.అమూల్య, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ గిరిదొర, ఎన్జీవో సుబ్బలక్ష్మి, డెమో సిబ్బంది బి.నాగేశ్వరరావు, ఎల్.కోటేశ్వరరావు, కె.శివాజీ, ఎం.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పీఎం పాలెం : స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విశాఖ జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గాయత్రినగర్, క్రికెట్ స్టేడియం ఏరియా, పీఎం పాలెం మొదటి బస్టాప్ ఏరియా, విజేత సూపర్ మార్కెట్, తులసీనగర్ పార్క్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గౌతు లచ్చన్న పోరాటం మరువలేనిది



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యాత కుల సంఘ పెద్దలు

భీమునిపట్నం: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న పోరాటం మరువలేనిదని పలువురు అన్నారు. బుధవారం ఆయన జయంతి సందర్భంగా యాత కుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యాత కుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంగటి రాము మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో గౌతు లచ్చన్న ఎంతో చురుగ్గా పాల్గొని గుర్తింపు పొందారన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఉద్యమాలను విజయవంతంగా నడిపారని, మహాత్మాగాంధీతో ఉప్పు సత్యాగ్రహంలో కూడా పాల్గొన్నారని గుర్తు చేశారు. అటువంటి గొప్ప వ్యక్తిని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని కోరారు. బాడి దబోయిన రాములప్పడు, సంఘ పెద్దలు బుత్తల నర్సింగరావు, యర్రా తాతయ్యలు, ఓల్లు అప్పారావు, అప్పలరాజు, చెల్లుబోయిన సత్యనారాయణ, దీనబోయిన రమణ, జి.పోలిరాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- పార్టీలు చూడకుండా పథకాలు అందించిన ఘనత ఆయనదే
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మహిళకు ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

సింహాచలం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కోటి 25లక్షల కుటుంబాలకు రెండు లక్షల కోట్ల రూపాయిలు సంక్షేమ పథకాల ద్వారా అందించడం దేశచరిత్రలోనే చాలా గొప్ప విషయమన్నారు. భీమిలి నియోజకర్గం పరిధి అడవివరం ఎస్సీకాలనీ, కాపుదిబ్బ ఏరియాల్లో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతా జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. పార్టీలు, కులమతాలు చూడకుండా, అవినీతికి తావులేకుండా.. రికమండేషన్లు లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ఒక్క 529 సచివాలయం పరిధిలోనే సుమారు రూ.9 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేశారన్నారు. ఆ వ్యవస్థలు ఉండడం వల్లే కరోనా కష్టకాలంలో కూడా ప్రజల బాగోగులు చూసే అవకాశం లభించిందని చెప్పారు. ఇంటి వద్దే ఒకటో తేదీన పింఛన్లు అందించడంతో పాటు చెంతనే రేషన్ సరకులు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు చుట్టూ తిరిగే పని లేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ 8వ జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు, గోపాలపట్నం సీఐ నరసింహారావు, వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, 98వ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, పార్టీ నాయకులు లంక సత్తిబాబు, ఎస్.కృష్ణ, బొట్టా శ్రీను, మధురెడ్డి, తెడ్లపు మహేష్, ఎస్సీ కాలనీ నిర్వాసితులు, నవయువ దళితసేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాలు మరమ్మతులకు నిధులు

ఎస్సీకాలనీలోని కమ్యూనిటీ హాల్ అదనపు అంతస్తు మరమ్మతులకు రూ.4 లక్షలు నిధులు మంజూరు చేయనున్నట్లు ముత్తంశెట్టి తెలిపారు. కమ్యూనిటీ హాల్ ఫ్లోరింగ్ లేదని, శిథిలావస్థలోఉందని స్థానికులు ముత్తంశెట్టి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తవగానే మంజూరయ్యే రూ.20 లక్షల నిధుల నుంచి నాలుగు లక్షలు కమ్యూనిటీ భవనంపై తస్తు మరమ్మతులకు వినియోగించాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు.

అప్రమత్తత అవసరం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పర్యటిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, తదితరులు

సీతమ్మధార: వర్షా కాలం దృష్ట్యా నగరంలోని ప్రధాన కాలువలతోపాటు చిన్న చిన్న కాలువలను ప్రతి రోజూ శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. జోన్–3 పరిధి 14వ వార్డులోని సీతమ్మధార, రామకృష్ణరాజునగర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం పరిసర ప్రాంతాల్లో బుధవారం కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డులో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదని, చెత్త కుప్పలు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. యూజీడీ కనెక్షన్లతోపాటు అల్లూరి సీతారామరాజు విగ్రహం జంక్షన్ వద్ద కల్వర్టు మరమ్మతులను వారం రోజులోగా పూర్తి చేయాలని, రామకృష్ణనగర్‌లో కల్వర్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని, నరసింహనగర్ రైతుబజార్ రోడ్డును 60 నుంచి 80 అడుగులకు విస్తరించేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

ఆకర్ష జోన్ ఏర్పాటు చేయండి

23వ వార్డు పరిధిలోని సీతమ్మధారలో కమిషనర్ సాయికాంత్ వర్మ పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం నుంచి రైతుబజార్ వరకు ఆకర్ష జోన్ ఏర్పాటు చేసి తోపుడు బళ్ల వ్యాపారులకు కేటాయించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఆదేశించారు. పర్యటనలో టౌన్ ప్లానింగ్ అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జెడ్సీ విజయలక్ష్మి, ఈఈ సత్యనారాయణరాజు, ఏఎంహెచ్‌వో రాజేష్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఆరుగురి అరెస్ట్

ఆరిలోవ: అర్ధరాత్రి సమయంలో ఓ వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన యువకులను ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎండాడలో స్టోన్ వాటర్ బార్ అండ్ రెస్టారెంట్‌లో షేక్ రోహిజ్ పని చేస్తున్నాడు. అతనితో పాటు పని చేస్తున్న మరో ఐదుగురు కలసి ఎండాడ దరి రాజీవ్‌నగర్‌లో ఉంటున్నారు. వారంతా రెండు రోజుల క్రితం విధులు ముగించుకుని అర్ధరాత్రి సమయంలో బార్ నుంచి ఇంటికి బయలుదేరారు. ఆ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన మరో ఆరుగురు యువకులు వారిని అడ్డగించారు. వారి వద్ద ఉన్న డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓ యువకుడి జేబులో రూ.2 వేలు నగదు తీసుకున్నారు. అంతటితో ఆగకుండా రాళ్లు, కర్రలతో దాడి చేశారు. షేక్ రోహిజ్ ముఖం, తలపై గాయపరిచారు. పెద్దగా కేకలు వేస్తూ వీరంగం వేశారు. దీంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు వచ్చి వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. వారిని సైతం పక్కకు నెట్టేసి అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది చేరుకుని గాయపడిన రోహిజ్‌కు ప్రథమ చికిత్స చేసి గీతం ఆస్పత్రికి తరలించారు. బాధితుడు రోహిజ్ ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. దాడి చేసిన ఆరుగురు యువకులను గుర్తించారు. వారు కూడా రాజీవ్‌నగర్‌కు చెందిన వారేనని సీఐ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

తాగునీరు వృథా



భీమిలి రోడ్డులో వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస: భీమిలి రోడ్డు చిల్లపేట – చిట్టివలస చెరువును ఆనుకుని వ్యతిరేక దిశలో వున్న రోడ్డులో బుధవారం తాగునీరు వృథాగా పోయింది. చిట్టివలస కొండపేట గోస్తనీ నది రిజర్వాయర్ నుంచి భీమిలి కొండపేటకు సరఫరా అయ్యే ఈ పైప్‌లైన్ నుంచి చాలా వరకు నీరు వృథాగా చెరువులో కలిసిపోయిందని స్థానికులు తెలిపారు. నీటి వృథాను అరికట్టేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హిందూ ధర్మంలో రైతులదే అగ్రస్థానం



ప్రసంగిస్తున్న మనోహర్ దాస్

సీతంపేట: సనాతన హిందూ ధర్మంలో రైతులే అగ్రస్థానంలో ఉన్నారని, వారిని తగిన విధంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని హిందూ ధర్మ ప్రచారకుడు మనోహర్ దాస్ అన్నారు. ద్వారకానగర్ బీవీకే కళాశాలలో బుధవారం జరిగిన మిషన్ కర్షక దేవోభవ ప్రచారం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పూర్వం రాజులు అన్నదాతలకు అండగా నిలిచేవారని, నేడు పాలకులు వారిని అత్యంత నిర్లక్ష్యంగా చూస్తున్నారన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు ఆదారి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ రైతుల జీవనాన్ని పాఠ్యాంశంగా చేర్చితే రైతు శ్రమ, విలువ విద్యార్థి దశ నుంచే తెలుస్తాయన్నారు. యోగి ప్రభాకర్ జీ మాట్లాడుతూ తినే ముందు రైతులకు ధన్యవాదాలు తెలియజేయడం కనీస ధర్మమన్నారు. వారికి సమాజంలో అత్యున్నత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20న స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించే ప్రదర్శన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పి.ఎస్.సేతు, ఎం.వి.శ్రీనివాసరెడ్డి, వి.వి.రామరాజుపాల్గొన్నారు.